సాక్షి వికారాబాద్

శుక్రవారం । 5 । ఏప్రిల్ । 2024



వరుస చోరీలు..

యాలాల మండలంలో వరుస చోరీలు సామాన్య జనాలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. 8లో ▸



ఎగిరిన ధ్వజం..

శ్రీవారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని కొడంగల్‌లో వెలసిన వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 8లో ▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్ :	సహర్ :
శుక్రవారం సాయంత్రం 6:35	శనివారం ఉదయం 4:44

న్యూస్‌రీల్

నీటి సమస్య తలెత్తకుండా చూడాలి

అడిషనల్ కలెక్టర్ రాహుల్‌శర్మ



నీటి సమస్యపై అధికారులతో చర్చిస్తున్న అడిషనల్ కలెక్టర్ రాహుల్ శర్మ

అనంతగిరి: గ్రామాల్లో నీటి సమస్య తలెత్తకుండా చూడాలని అడిషనల్ కలెక్టర్ రాహుల్‌శర్మ అధికారులకు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జిల్లాలోని మిషన్ భగీరథ, గ్రామ, డివిజన్ పంచాయతీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత సీజన్‌లో తాగునీటి సమస్య తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నిరుపయోగంగా ఉన్న, పాడైపోయిన బోర్ వెల్స్, చేతిపంపులను బాగు చేయించాలని ఆదేశించారు. అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. ప్రజలు నీటిని వృథా చేయరాదని, పొదుపుగా వాడుకోవాలని సూచించారు. సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి జయసుధ, మిషన్ భగీరథ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బాబు శ్రీనివాస్, డివిజనల్ పంచాయతీ అధికారులు సంధ్యారాణి, శంకర్ నాయక్, మిషన్ భగీరథ డీఈలు సుబ్రహ్మణ్యం, రత్న ప్రసాద్, శశాంక్ మిశ్ర తదితరులు పాల్గొన్నారు.

7న ప్రవేశ పరీక్ష



రేణుకాదేవి, డీఈఓ

అనంతగిరి: ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశాలకు ఈ నెల 7న పరీక్ష నిర్వహిస్తున్నట్లు డీఈఓ రేణుకాదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024 -25 విద్యా సంవత్సరానికి గాను జిల్లాలోని ఆదర్శ పాఠశాలల్లో ఏప్రిల్ 7వ తేదీ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 6వ తరగతి ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు 7, 8, 9, 10వ తరగతులకు సంబంధించి ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. మండల కేంద్రాల్లోని ఆదర్శ పాఠశాలల్లో పరీక్షలు జరుగుతాయని తెలిపారు. పరీక్ష రాసే విద్యార్థులు గంట ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రంలోకి సిబ్బంది, విద్యార్థులు సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకెళ్లరాదని సూచించారు.

ఆర్‌ఎంపీ, పీఎంపీలకు ప్రభుత్వం శిక్షణ ఇవ్వాలి

సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సతీశ్‌కుమార్



మాట్లాడుతున్న సతీశ్‌కుమార్ తదితరులు

మొయినాబాద్‌రూరల్: ఆర్‌ఎంపీ, పీఎంపీలకు ప్రభుత్వం శిక్షణ ఇవ్వాలని ఆర్‌ఎంపీల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జె.సతీశ్‌కుమార్ కోరారు. గురవారం ఆయన తన కార్యాలయంలో ఆర్‌ఎంపీలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2009-10 సంవత్సరంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ జీఓ నెంబర్ 420తో ఏడాది పాటు ఉమ్మడి రాష్ట్రంలో శిక్షణ ఇప్పించారని గుర్తు చేశారు. వారి మరణాంతరం శిక్షణ నిలిచిపోయిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఈ ప్రక్రియను పునరుద్ధరిస్తే గ్రామాల్లో పేదలకు పనిచేసుకునే అవకాశం ఉంటుందన్నారు. గ్రామ వైద్యుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో రవియాదవ్, రవికుమార్‌యాదవ్, జగదీశ్వర్, కుమార్ యాదవ్, కె.జగన్ తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే సబితారెడ్డి



క్షతగాత్రుడితో మాట్లాడుతున్న సబితారెడ్డి

కందుకూరు: మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి ప్రమాదవశాత్తు గాయపడిన వ్యక్తిని ఆస్పత్రికి తరలించి మానవత్వం చాటుకున్నారు. గురువారం ఆమె మండల పరిధిలో పలు శుభకార్యాలకు హాజరయ్యారు. బైరాగిగూడ సమీపంలో రాచలూరుకు చెందిన కుమ్మరి రమేశ్ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. అటుగా వెళ్తున్న ఎమ్మెల్యే వెంటనే తన వాహనాన్ని క్షతగాత్రుడి గాయాలను పరిశీలించారు. తాగునీరు ఇచ్చి ఆస్పత్రికి తరలించే ఏర్పాటు చేయించారు.



కల్యాణ వేడుకకు హాజరైన భక్తజనం

నేత్రపర్వం.. వెంకన్న కల్యాణం

తాండూరు మండలం చెంగోల్ గ్రామంలో శ్రీదేవీ భూదేవీ సమేత వేంకటేశ్వర స్వామి విగ్రహాల పునఃప్రతిష్ఠాపన కార్యక్రమాలు గురువారం ముగిసాయి. ఉదయం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు కిషోర్ పంతులు, హైదరాబాద్ నుంచి వచ్చిన అర్చకుల ఆధ్వర్యంలో స్వామి కల్యాణం నేత్రపర్వంగా సాగింది. అనంతరం అన్నదానం చేశారు. వేడుకల్లో నాయకులు, స్థానికులు, ఆలయ కమిటీ సభ్యులు వడ్డే కృష్ణయ్య, ఇంద్రసేనారెడ్డి, హన్మయ్య, నర్సింలు, నారాయణరెడ్డి, వివేకానంద, ఛత్రపతి శివాజీ సంఘం సభ్యులు పాల్గొన్నారు. – తాండూరు రూరల్



పూజలందుకున్న శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి



నూతనంగా ప్రతిష్ఠించిన వెంకన్న విగ్రహం

పరనిందకే ప్రాధాన్యం!

సంఘర్షణను తలపించిన సన్నాహక సభ

- మరోసారి బయటపడిన బీఆర్‌ఎస్ నేతల విభేదాలు
- ఒకరిపై ఒకరు ఆరోపణల పర్వం
- సున్నితంగా చురకలంటించిన కేటీఆర్, సబితమ్మ
- తట్టు తగిలింది.. బట్టగట్టాలని సూచన



వికారాబాద్: బీఆర్‌ఎస్ పార్టీ బుధవారం వికారాబాద్‌లో నిర్వహించిన లోక్‌సభ సన్నాహక సమావేశంలో నేతలు అసలు విషయాన్ని పక్కనబెట్టి స్వీయ పొగడ్తలు.. పరనిందలకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారు. నేతల ప్రసంగాలు చూస్తే ఇది సన్నాహక సమావేశమా..? లేక సంఘర్షణ సమావేశమా అనే అనుమానం తలెత్తకమానదు. సమావేశం ఆద్యాంతం అసెంబ్లీ ఎన్నికల ఓటమిపై సాగింది. జెడ్పీ వైస్ చైర్మన్ బైండ్ల విజయ్‌కుమార్ మొదలుకొని వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆనంద్, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య వరకు ఓటమికి గల కారణాలను విశ్లేషిస్తూ పరనిందలకే ప్రాధాన్యత ఇచ్చారు. ఇందులో కొందరు పరోక్షంగా ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటే, మరొకరు నేరుగా పేర్లను ప్రస్తావిస్తూ విమర్శలు గుప్పించారు. ఇది ఇటీవల పార్టీని విడిచి వెళ్లిన వారి వద్దకు వెళ్లి ఆగింది. అయితే ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి సబితారెడ్డి ఈ హఠాత్ పరిణామానికి అవాక్కయ్యారు. చివరకు తేరుకుని సున్నితంగా చురకలంటించారు. బీఆర్‌ఎస్ చేవెళ్ల లోక్‌సభ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను ప్రమోట్ చేయటానికి చివరి ప్రాధాన్యత ఇచ్చినట్లు కనిపించింది.

నిందలతోనే సరి

అధికారంలో ఉన్న సమయంలో కేటీఆర్ వచ్చారంటే స్వామి భక్తి చాటేందుకు పోటీ పడే జిల్లా నేతలు.. ఈ సారి అందుకు భిన్నంగా ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడం కనిపించింది. ఎంతలా అంటే చివరకు స్వయంగా, పరోక్షంగా వికారాబాద్ నేతలకు మంచి మాటల చతురత ఉందికదా అంటూ ముక్తాయించేంతగా నేతలు రెచ్చిపోయారు. వికారాబాద్‌లో ఆనంద్ చాలా మంది సీనియర్ నాయకులను దూరం చేసుకోవడం.. ఉద్యమకారులకు పదవులు ఇవ్వకుండా కొత్తవారిని ఆదరించడమే కొంప ముంచిందంటూ చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య విమర్శలు చేశారు. జెడ్పీ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్ సైతం ఇదే భావన వ్యక్తం చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆనంద్ తానేం తక్కువా అన్నట్టుగా మాట్లాడారు. తనపై చేసిన విమర్శలను తిప్పి కొట్టడం, వివరణ ఇచ్చుకోవటంతో పాటు పరోక్షంగా ఆయన కూడా తమ పార్టీ నేతలపై విరుచుకపడ్డారు. ఏ పార్టీలో ఉన్నా ఆ పార్టీకి నిబద్ధతతో ఉండాలి.. ఒక పార్టీలో ఉంటూ మరో పార్టీకి సపోర్టు చేసేవారు ఉన్నంత కాలం పరిస్థితి ఇలాగే ఉంటుంది.. ఇలాంటి వారిని క్షమించరాదు అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తూనే.. తాను ఎమ్మెల్యేగా గెలిచాక తన సొంత బావ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు సైతం దూరంగా ఉన్నా.. పేకాట పేకాటే బావ మరిది బావమరిదే అన్నట్టుగా తాను వ్యవహరించానని చెప్పుకొచ్చారు.

ఇప్పటికైనా మారండి..

జిల్లా నేతలు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్యే ఒకరిపై ఒకరు విమర్శలకు దిగటంతో విసిగిపోయిన కేటీఆర్, సబితారెడ్డి చురకలంటించారు. జిల్లాకు చెందిన పక్క పార్టీల నేతల గురించి ఒక్కమాట కూడా మాట్లాడకుండా తమ పార్టీ నుంచి ఇటీవల బయటకు వెళ్లిన నేతలతో పాటు సీఎం, పీఎంలపై విమర్శలకే ప్రాధాన్యమిచ్చారు. ఇటీవలి ఎన్నికల్లో తట్టు తాకింది.. బట్ట కట్టాలి.. ఇప్పటికైనా మారాలి అంటూ ఆనంద్‌ను ఉద్దేశించి సున్నితంగా హెచ్చరించారు. ఇదే సమయంలో యాదయ్య తాను ఇప్పటిదాకా కొంత ఆలోచించాను కానీ ఇప్పుడు పార్టీ మారడం లేదు.. అని చెప్పడంపై కాడా కేటీఆర్ స్పందించారు. యాదయ్య మహా చమత్కారి.. ఆనంద్‌లా లౌక్యం తెలవనోడు కాదు.. అంటు ముక్తాయించారు. అధికారంలో ఉన్న సమయంలో కార్యకర్తలను పట్టించుకోని నేతలు ఈ ఎన్నికలు కార్యకర్తలకే సవాల్.. వారిదే గెలుపు బాధ్యత అంటూ చెప్పుకొచ్చారు. ఇలా సమావేశం ఆద్యాంతం అభ్యర్థి కాసానిని ప్రమోట్ చేయటానికి ద్వితీయ ప్రాధాన్యతనిచ్చి పరనిందల పర్వానికి తెరతీశారు.



మాట్లాడుతున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

మోదీ హ్యాట్రిక్ పీఎం ఖాయం

- లోక్‌సభ ఎన్నికల్లో 400 స్థానాల్లో విజయం సాధిస్తాం
- బీజేపీ చేవెళ్ల లోక్‌సభ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి
- పెద్దేముల్‌లో ప్రజా ఆశీర్వాద యాత్ర

పెద్దేముల్: నరేంద్రమోదీ హ్యాట్రిక్ పీఎం కావడం తథ్యమని మాజీ ఎంపీ, బీజేపీ చేవెళ్ల లోక్‌సభ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. గురువారం పెద్దేముల్, మంబాపూర్, కందనెల్లి, గాజీపూర్, గొట్లపల్లి, అడ్కిచెర్ల, తట్టెపల్లి, నాగులపల్లి, గోపాల్‌పూర్ గ్రామాల్లో ప్రజా ఆశీర్వాద యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ చొరవతోనే గ్రామాలు అభివృద్ధి చెందాయన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం వస్తే పేదల బతుకులు మారుతాయని అనుకుంటే కేసీఆర్ కుటుంబం మాత్రమే అన్ని విధాలా బాగుపడిందన్నారు. పదేళ్ల మోదీ పాలనలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని, సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ చేరాయని పేర్కొన్నారు. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 400 స్థానాల్లో గెలుపొంది మరో సారి అధికారం చేపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు ఒక్కటేనని, వాటికి బుద్ధి చెప్పాలని ప్రజలను కోరారు. దేశం సురక్షితంగా, సుభిక్షంగా ఉండాలంటే బీజేపీని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణ ముదిరాజ్, జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్, పార్టీ మండల అధ్యక్షుడు హరీష్‌గౌడ్, మాజీ అధ్యక్షుడు సందీప్‌కుమార్, నాయకులు స్వామిదాస్, రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

ఇండియా కూటమిదే అధికారం

- భిన్నత్వంలో ఏకత్వం కాంగ్రెస్‌తోనే సాధ్యం
- తుక్కుగూడ జన జాతర సభను విజయవంతం చేయాలి
- ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి: మతాలు, కులాల మధ్య చిచ్చుపెట్టి పాలన సాగిస్తున్న బీజేపీకి ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో గుణపాఠం తప్పదని, ఇండియా కూటమి అధికారంలోకి రావడం ఖాయమని డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే టీ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 6న తుక్కుగూడలో నిర్వహించే జన జాతర సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ సభ 10లక్షల మందితో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ తదితరులు హాజరవుతారని తెలిపారు. భిన్నత్వంలో ఏకత్వం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. బీజేపీ అధికారంలో ఉండి మతాలను రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తోందని ఆరోపించారు. ఆ పార్టీ పదేళ్ల పాలనలో ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీలను అమలు చేస్తోందని తెలిపారు. కాంగ్రెస్ ప్రజల పార్టీ అని, కష్టపడి పనిచేసే వారికి గుర్తింపు ఉంటుందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్తా పని చేయాలని పిలుపునిచ్చారు. చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమన్నారు. అనంతరం ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ ప్రీతం మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. దేశ ప్రజలంతా రాహుల్ గాంధీ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎర్రగడ్డపల్లి కృష్ణ, పరిగి వైస్ ఎంపీపీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు రైతు సత్యాగ్రహ దీక్ష

బీజేపీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులైనా రైతన్నల సమస్యల పరిష్కారంలో విఫలమైందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి ఆరోపించారు. గురువారం ఆయన ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి అధ్యక్షత విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. సోనియా గాంధీ పుట్టిన రోజున రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని నేటికీ ఆ ఊసే ఎత్తడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు బంధు పత్తా లేదన్నారు. రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం ధరణి క్యాంపులు నిర్వహించి గాలికొదిలేశారన్నారు. ఆరు గ్యారంటీల అమలులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతాంగ సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో సత్యాగ్రహ దీక్ష చేపడుతున్నామని.. ఈ దీక్షకు కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ హాజరవుతారని చెప్పారు. అంబేద్కర్ చౌరస్తా వద్ద నిర్వహించే దీక్షకు బీజేపీ శ్రేణులు పెద్ద ఎత్తున హాజరవ్వాలని పిలుపునిచ్చారు.

‘కారు’కు షాక్.. నెగ్గిన అవిశ్వాసం

- ‘పట్నం’ వైస్ చైర్మన్‌కు వ్యతిరేకంగా 17మంది ఓటు

ఇబ్రహీంపట్నం రూరల్: బీఆర్‌ఎస్‌కు వరుస షాక్‌లు తగులుతున్నాయి. ఓ వైపు పార్టీ లీడర్లంతా కారు దిగుతుంటే.. మరో వైపు స్థానిక సంస్థల్లో పట్టు తగ్గుతోంది. గురువారం ఇబ్రహీంపట్నం మున్సిపల్ వైస్‌చైర్మన్ ఆకుల యాదగిరిపై పెట్టిన అవిశ్వాసం నెగ్గింది. మార్చి 11న మున్సిపల్ కౌన్సిలర్లు 14 మంది వైస్ చైర్మన్‌కు వ్యతిరేకంగా కలెక్టర్‌కు అవిశ్వాస నోటీసు అందజేశారు. దీంతో ఏప్రిల్ 4న కలెక్టర్ ఓటింగ్‌కు అనుమతిచ్చారు. ఉదయం 10.30గంటలకు ఇబ్రహీపట్నం ఆర్డీఓ అనంతరెడ్డి ప్రిసైడింగ్ అధికారిగా వ్యవహరించి మున్సిపల్ కార్యాలయంలో ఓటింగ్ ఏర్పాటు చేశారు. 11గంటల వరకు కౌన్సిలర్లు హాజరవ్వలేదు. 11.30గంటలకు సభ్యులు ప్రత్యేక బస్సులో కార్యాలయానికి చేరుకున్నారు. ప్రిసైండింగ్ అధికారి నియమనిబంధనలు కౌన్సిలర్లకు చదివి వినిపిచారు. మొత్తం 24 మంది కౌన్సిలర్లుండగా.. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఎక్స్ అఫిషియో సభ్యుడిగా ఓటు నమోదు చేసుకున్నారు. దీంతో సభ్యుల సంఖ్య 25మందికి చేరింది. ఈ సమావేశానికి 17మంది సభ్యులు హాజరై అవిశ్వాసానికి మద్దతుగా చేతులెత్తారు. ప్రత్యర్థులు, వ్యతిరేకించేవారు లేకపోవడంతో అవిశ్వాసం నెగ్గినట్లు ప్రిసైడింగ్ అధికారి ప్రకటించారు.

బీఆర్‌ఎస్‌కు చెందిన తొమ్మిది మంది మద్దతు

బీఆర్‌ఎస్‌కు చెందిన వైస్ చైర్మన్ ఆకుల యాదగిరిని తొలగించడానికి అదే పార్టీకి చెందిన తొమ్మిది మంది కౌన్సిలర్లు హాజరయ్యారు. అవిశ్వాసానికి సంపూర్ణ మద్దతిస్తున్నట్లు ప్రకటించారు. ఏడుగురు కాంగ్రెస్ నుంచి, బీఆర్‌ఎస్ నుంచి తొమ్మిది మంది, ఒక ఎక్స్ అఫీషియో సమావేశానికి హాజరవ్వగా.. బీఆర్‌ఎస్‌కు చెందిన ఆరుగురు, బీజేపీ నుంచి ఇద్దరు గైర్హాజరయ్యారు.

అడుగంటుతున్న ‘జుంటుపల్లి’

- 18 అడుగుల దిగువకు నీరు
- చివరి ఆయకట్టుకు తడులు అందని వైనం
- శిథిలావస్థలో తూములు, కాల్వలు
- ఆందోళనలో అన్నదాతలు



మరమ్మతులకు నోచుకోని కాలువ



జుంటుపల్లి ప్రాజెక్టులో తగ్గిన నీటి మట్టం

యాలాల: మండలంలోని జుంటుపల్లి ప్రాజెక్టులో నీరు అడుగంటుతోంది. శిథిలావస్థకు చేరిన తూములు, లీకేజీల కారణంగా 24 అడుగుల నీటి సామర్థ్యం కలిగిన ఈ ప్రాజెక్టులో నీరు ఆరు అడుగులకు పడిపోయింది. దీంతో చివరి ఆయకట్టుకు నీరందని పరిస్థితి నెలకొంది. ప్రాజెక్టు నీటి సామర్థ్యం 22 అడుగులు. 2,200 ఎకరాల ఆయకట్టు ఉంది. చాలా ఏళ్లుగా ప్రాజెక్టు రెండు తూములు శిథిలావస్థకు చేరాయి. దీంతో చాలా మంది రైతులు బోరు బావులపై ఆధార పడాల్సి వస్తోంది. గతంలో ప్రాజెక్టు కింద రెండు పంటలు సాగు చేసేవారు. నీటి మట్టం తగ్గడంతో ఒకే పంటకు పరిమితమవుతున్నారు. ఎండ తీవ్రత పెరగడంతో బోర్లలో సైతం నీరు రావడం లేదు. పంటలను కాపాడుకోవడానికి రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. పేర్కంపల్లి, పేర్కంపల్లి తండా, ఎన్కెపల్లి, చెన్నారం తదితర గ్రామాల్లోని చివరి ఆయకట్టుకు నీరందడం లేదు. ప్రస్తుత సీజన్‌లో సాగుచేసిన వరి పంట ఎండి పోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

లీకేజీలతో నీరు వృథా



జుంటుపల్లి ప్రాజెక్టు చివరి ఆయకట్టుకు నీరు అందడం లేదు. ప్రతి ఏటా ఇదే పరిస్థితి. తూము లీకేజీ కారణంగా నీరంతా వృథాగా పోతోంది. ఈ సమస్యను ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు. వెంటనే కాలువ, తూముకు మరమ్మతులు చేపట్టాలి.

– లక్ష్మణ్‌నాయక్, ఆయకట్టు రైతు, పేర్కంపల్లి తండా

తూములను బాగు చేయాలి



జుంటుపల్లి ప్రాజెక్టు తూములు, కాలువలకు మరమ్మతులు చేయాలి. ప్రస్తుతం చివరి ఆయకట్టు భూములకు సాగునీరు అందడం లేదు. బోర్లపై ఆధార పడాల్సి వస్తోంది. ఈసారి బోర్లు కూడా ఆశించిన స్థాయిలో నీరు రావడం లేదు. అధికారులు, ప్రభుత్వ పెద్దలు సాగునీటి ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి సారించాలి.

– రవినాయక్, ఆయకట్టు రైతు, పేర్కంపల్లి తండా

క్లుప్తంగా

నేరాల నియంత్రణకు కార్డన్ సెర్చ్

డీఎస్పీ కరుణసాగర్‌రెడ్డి



వాహనదారులతో మాట్లాడుతున్న డీఎస్పీ

పరిగి: నేరాల నియంత్రణకు కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు డీఎస్పీ కరుణసాగర్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని తుంకుల్ గడ్డ పరిసర ప్రాంతాల్లో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి వాహనాలను తనిఖీ చేసి సరైన ధ్రువపత్రాలు లేని 75 టూవీలర్స్, 3 త్రీవీలర్ వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి సేవించిన, విక్రయించిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలను నడపడం నేరమని వేగంగా, అజాగ్రత్తగా నడిపే వారిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో దొరికితే జరిమానాతో పాటు జైలు శిక్ష ఉంటుందన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని చెప్పారు. గ్రామాలు, పట్టణాల్లో కొత్త వ్యక్తులు వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. వాహనదారులు అన్ని రకాల ధ్రువపత్రాలను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్, ఎస్సై సంతోష్‌కుమార్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బెల్టు షాపుపై దాడి

తలకొండపల్లి: పోలీసులు బెల్టు షాపుపై దాడి చేసి మద్యాన్ని స్వాధీనం చేసుకున్న ఘటన మండలంలోని పాతా కోట తండాలో జరిగింది. ఎస్ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని పాతాకోటతండాలో పాత్లావత్తు తిరుపతి తన కిరాణా షాపులో అక్రమంగా మద్యాన్ని విక్రయిస్తున్నాడన్న పక్కా సమాచారంతో పోలీసులు గురువారం దాడి చేశారు. 12 క్వార్టర్లు, ఒక బీరు కాటన్‌ను స్వాధీనం చేసుకున్నారు. తిరుపతిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ చెప్పారు.

వరుస చోరీలు.. జనం బెంబేలు!

రెచ్చిపోతున్న దొంగలు

- 15 రోజుల వ్యవధిలో వరుస ఘటనలు
- ప్రధాన ప్రాంతాల్లో పనిచేయని సీసీ కెమెరాలు
- భయాందోళనలో మండల ప్రజలు



యాలాల: మండలంలోని మిత్రానగర్‌లో చోరీకి గురైన ఇంట్లో చెల్లాచెదురుగా సామగ్రి (ఫైల్)

యాలాల: మండలంలోని వివిధ ప్రాంతాల్లో వరుసగా జరుగుతున్న చోరీలు సామాన్య జనాలను భయాందోళన కలిగిస్తున్నాయి. మూగజీవాలను కూడా దొంగలు వదలడం లేదు. గత 15 రోజుల వ్యవధిలో వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న చోరీలు సామాన్యుల కంటికి నిద్రలేకుండా చేస్తున్నాయి. కాగా, ప్రధాన చౌరస్తాల్లో, సరిహద్దు ప్రాంతాల్లో, సమస్యాత్మక ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన నిఘా నేత్రాలు (సీసీ కెమెరాలు) పని చేయకపోవడం దొంగలకు కలిసి వస్తుంది. ఇదే అదునుగా దొంగలు రెచ్చిపోయి పోలీసులకు సవాలుగా మారుతున్నారు.

మండలంలో జరిగిన దొంగతనాల వివరాలు..

- ▲ మండల పరిధిలోని మిత్రానగర్‌లో నివాసముండే ఆర్టీసీ మహిళా ఉద్యోగి ఇంట్లో పట్టపగలే ఓ దొంగ దూరి చోరీకి పాల్పడ్డాడు. మహిళ ఉద్యోగి దాచుకున్న రూ.30వేల నగదుతో పాటు 3 తులాల బంగారం ఎత్తుకెళ్లినట్లు బాధితురాలు పేర్కొంది.
- ▲ మరో ఘటనలో మండల పరిధిలోని బెన్నూరు శివారులో ఓ రిటైర్డ్ జడ్జికి చెందిన మామిడి తోటలో స్ప్రింక్లర్ పైపులను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఈ ఘటన విషయమై బాధితుడి తరఫున ఓ వ్యక్తి యాలాల పోలీసులకు సమాచారం ఇచ్చినప్పటికీ ఫిర్యాదు చేయలేదు.
- ▲ గత శనివారం అర్ధరాత్రి బాగాయిపల్లి గ్రామానికి చెందిన రైతులు తొంట ఆశప్ప తన పాకలో కట్టేసిన 4 ఆవులు, 1 ఎద్దు, అదే గ్రామానికి చెందిన మరో రైతు తాండ్ర మల్లప్ప పాకలో నుంచి ఒక ఆవును దొంగలు వాహనంలో ఎత్తుకెళ్లారు. మరుసటి రోజు ఉదయం బాధిత రైతులు తమ పశువులు కనిపించకపోవడంతో చోరీకి గురైనట్లు గ్రహించి యాలాల పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాగాయిపల్లి గ్రామంలో ప్రధాన చౌరస్తా నుంచి బొలెరో లాంటి వాహనంలో పశువులను తరలించినట్లు పోలీసులు అనుమానించి సీసీ కెమెరాలను పరిశీలించారు. అయితే సీసీ కెమెరాలు పని చేయకపోవడంతో ముద్దాయిపేట, రాస్నం గ్రామాల్లో అందుబాటులో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది.
- ▲ ఇటీవల అగ్గనూరు గ్రామంలో సైతం పొలం వద్ద మోటారు చోరీకి గురైనట్లు సమాచారం. మండలంలో దొంగల స్వైరవిహారం పోలీసులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తుంది.

పని చేయని సీసీ కెమెరాలు

మండల పరిధిలో ప్రధాన ప్రాంతాలు, సరిహద్దు, సమస్యాత్మక ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. మండలంలోని లక్ష్మీనారాయణపూర్ చౌరస్తా, దేవనూరు, యాలాల, బాగాయిపల్లి, ము ద్దాయిపేట, బండమీదిపల్లి, రాస్నం, కోకట్, ఎన్కెపల్లి తదితర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాల్సి ఉన్నప్పటికీ ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేయలేదు. కొన్ని ప్రాంతాల్లో ఏర్పాటు చేసినప్పటికీ కొన్నింటికి కేబుల్ తెగిపోగా, మరికొన్నింటికి కరెంటు సరఫరా లేకపోవడం, స్టోరేజీ సమస్యతో వినియోగంలో లేకుండా పోయాయి. ఈ విషయంలో పోలీసు ఉన్నతాధికారులు దృష్టి సారించి చోరీలకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.



యాలాల: బాగాయిపల్లిలోని ప్రధాన చౌరస్తా

> **ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నాం..**
>
> బాగాయిపల్లి నుంచి తస్కరించిన మూగజీవాల కేసు విషయంలో సీరియస్‌గా ఉన్నాం. దొంగల ఆచూకీ కోసం మా పోలీసు బృందాలు ప్రత్యేకంగా గాలిస్తున్నాయి. దొంగలు ఉపయోగించిన వాహనం తాలుకూ వివరాలు సీసీ కెమెరాల్లో లభ్యం కాలేదు. కేసును త్వరగా ఛేదించి వివరాలు వెల్లడిస్తాం.
>
> –అశోక్ కుమార్, తాండూరు రూరల్ సీఐ

24గంటల్లో దొంగల అరెస్టు



పోలీసుల అదుపులో నిందితుడు

అనంతగిరి: రైలులో నిద్రిస్తున్న ప్రయాణికురాలి ల్యాప్‌టాప్ బ్యాగ్, సెల్‌ఫోన్, రూ.15వేల నగదును అపహరించిన దొంగలను వికారాబాద్ రైల్వే పోలీసులు 24 గంటల్లో అదుపులోకి తీసుకున్నారు. రైల్వే సీఐ వెంకటరత్నం వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన ప్రియమనస్విని పూణే నుంచి హైదరాబాద్‌కు ముంబాయి ఎక్స్‌ప్రెస్‌లో ఏసీ కోచ్‌లో ప్రయాణిస్తుంది. ఈనెల 3న ఉదయం రైలు వికారాబాద్‌కు వచ్చింది. ఈ క్రమంలో రైలులోకి ఇద్దరు వ్యక్తులు ప్రవేశించి సదరు మహిళా నిద్రించడాన్ని గమనించారు. వెంటనే వారు ఆమె వద్ద ఉన్న ల్యాప్‌టాప్ బ్యాగ్‌ను తీసుకొని నడుస్తున్న రైలుల్లోంచి దూకి పారిపోయారు. అందులో ల్యాప్‌టాప్, ల్యాప్టాప్ చార్జర్, యూఎస్‌బీ హబ్, సెల్‌ఫోన్, రూ.15వేల నగదు ఉంది. వెంటనే ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు. ఈ క్రమంలో గురువారం ఉ.5గంటల సమయంలో నిందితులిద్దరు వికారాబాద్ రైల్వే స్టేషన్‌కు వచ్చి బీదర్ వెళ్లేందుకు సిద్ధమయ్యారు. ఎన్నికల నేపథ్యంలో ఆర్‌పీఎస్ సీఐ రాజేంద్రప్రసాద్, జీఆర్‌పీ ఎస్ఐ శంకరయ్య తన సిబ్బందితో తనిఖీలు చేస్తున్నారు. ఈ క్రమంలో రెండో నంబర్ ప్లాట్‌ఫారం పై బ్లాక్ కలర్ షోల్డర్ బ్యాగ్‌తో ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా తిరగడం గమనించారు. వెంటనే వారిని తనిఖీలు చేయగా అసలు విషయం బయటపడింది. బీదర్‌కు చెందిన ఎండీ ఇస్మాయిల్‌తో మరో యువకుడు ఉన్నారు. వీరు జల్సాలకు అలవాటు పడి చోరీలు చేస్తున్నట్లు చెప్పారు. వారి నుంచి ల్యాప్‌టాప్, చార్జర్, సెల్‌ఫోన్, యూఎస్బీ హబ్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ విషయమై రైల్వే ఏడీజీ మహేశ్ భగవత్, సికింద్రాబాద్ ఎస్పీ షేక్ సలీమా వికారాబాద్ రైల్వే పోలీసుల కృషిని అభినందించడంతో పాటు రివార్డులు అందజేయడం జరుగుతుందని సీఐ తెలిపారు.

ట్రాక్టర్‌ను ఢీకొట్టిన ట్యాంకర్..

ఒకరి మృతి



ఘటన స్థలంలో బోల్తాపడిన వాహనాలు

యాలాల: ఎదురుగా వస్తున్న ఓ ట్రాక్టర్‌ను ట్యాంకరు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని లక్ష్మీనారాయణపూర్ సమీపంలో తెల్లవారుజామున చోటు చేసుకుంది. కానిస్టేబుల్ హన్మంతు వివరాల ప్రకారం.. కోస్గి మండలం నాచారం గ్రామానికి చెందిన డప్పు బాల్‌రాజ్(40) తాండూరులో లభించే గోడరాయి కోసం ట్రాక్టర్‌ను తీసుకొని లక్ష్మీనారాయణపూర్ వైపు నుంచి తాండూరుకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న సిమెంటు ట్యాంకర్ ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో రెండు వాహనాలు అదుపుతప్పి బోల్తాపడ్డాయి. తీవ్రంగా గాయపడిన ట్రాక్టర్ డ్రైవర్ బాల్‌రాజ్‌ను చికిత్స నిమిత్తం తాండూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు స్పష్టం చేశారు. మృతుడి భార్య వెంకటమ్మ ఫిర్యాదు మేరకు కేసు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పూడూరు: చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని చన్గోముల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. చన్గోముల్ హెడ్ కానిస్టేబుల్ పెంటయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని తుర్క ఎన్కెపల్లి గ్రామానికి చెందిన బేగరి రాములు(58) ఈ నెల 2న ద్విచక్రవాహనంపై పొలానికి వెళ్తూ అదుపుతప్పి పడటంతో తలకు గాయాలయ్యాయి. గమనించిన కుటుంబ సభ్యులు షాద్‌నగర్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య హంసమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎగిరిన ధ్వజం.. పులకించిన జనం

- వాహన సేవలు ప్రారంభం
- పేదల తిరుపతిగా బాలాజీనగర్



ధ్వజాన్ని ఎగురవేస్తున్న అర్చకులు

కొడంగల్ : శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా కొడంగల్‌లోని ఆలయంలో గురువారం సాయంత్రం ధ్వజారోహణ కార్యక్రమం వైఖానస ఆగమ శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. హాజరైన జనం భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. దేవేరుల సమేతంగా మలయప్పస్వామి వెలిసిన బాలాజీనగర్ పేదల తిరుపతిగా పేరుగాంచింది. అర్చకులు మంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాలు, గోవింద నామస్మరణతో ఆలయం మార్మోగింది. స్వామివారు తిరుచ్చి ఉత్సవంలో భక్తులకు దర్శనమిచ్చారు. విష్వక్సేన ఆరాధన, వాస్తుహోమం, గరుడ లింగహోమం, గరుడ ప్రతిష్ఠ, రక్షా బంధనం చేపట్టారు. గరుత్మంతుడి చిత్రపటాన్ని కొత్త వస్త్రంపై లిఖించి పూజలు చేసి ధ్వజ స్తంభంపై ఎగురవేశారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. తిరుమలకు వెళ్లలేని భక్తులు ఇక్కడకు వచ్చి తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకుంటున్నారు. తిరుమల నుంచి ఇక్కడికి ప్రతి సంవత్సరం అర్చకులు వచ్చి పూజలు చేయడం సంప్రదాయం. గరుడోత్సవం రోజు తిరుమల నుంచి శేషవస్త్రాలను తీసుకొస్తారు. ప్రభుత్వం తరఫున సీఎం రేవంత్‌రెడ్డి ఈనెల 8న స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తారు. భాజా భజంత్రీలు వాయించే నాయీ బ్రాహ్మణులు నెల్లూరు నుంచి వచ్చారు. స్వామివారికి అలంకరించే పూలు చెన్నై నుంచి తెప్పిస్తున్నారు.

వాహన సేవలు ప్రారంభం

వారం రోజుల పాటు ప్రతి రోజు ఉ.9 గంటలకు రాత్రి 9 గంటలకు వాహన సేవలు నిర్వహిస్తారు. ఆలయం మాడ వీధుల్లో స్వామివారిని ఊరేగిస్తారు. ఆలయం నుంచి జాతర స్థలం వరకు స్వామివారు వెళ్లి భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తారు. గురువారం పెద్ద శేషవాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు.



ఉత్సవమూర్తులకు పూజలు చేస్తున్న అర్చకులు



మాఢవీధుల్లో స్వామివారి ఊరేగింపు

బహిరంగ ప్రకటన

నా క్లయింట్ సాజిదా బేగం భర్త మహమ్మద్ సలీమ్, సుమారు 40 సంవత్సరాలు, వృత్తి : గృహిణి, నివాసం : ఇంటి నం.4-56, బందయెల్మెచర్ల గ్రామం, కుల్కచర్ల మండలం, వికారాబాద్ జిల్లా వారి పరిగి మున్సిపాలిటీ వద్ద గల సర్వే నం. 421లో 201.66 చ.గ. కొలతలతో ప్లాట్ నం. 3కు సంబంధించి SRO పరిగి వద్ద నమోదైన రిజిస్టర్డ్ సేల్ డీడ్ డాక్యుమెంట్ నం. 685/2005 తేది: 15.03.2005 కలిగిన లింక్ డాక్యుమెంట్ పోయిందని సాధారణ ప్రజలకు ఇందుమూలంగా తెలియజేయడమైనది. ఎవరేని వ్యక్తి లేదా వ్యక్తులకు సదరు లింక్ డాక్యుమెంట్ దొరికినచో దానిని సాజిదా బేగం భర్త మహమ్మద్ సలీమ్, సుమారు వయసు 40 సంవత్సరాలు, వృత్తి : గృహిణి, నివాసం : ఇంటి నం. 4-56, బందయెల్మెచర్ల గ్రామం, కుల్కచెర్ల మండలం, వికారాబాద్ జిల్లా, తెలంగాణ వారికి ఇవ్వగలరు.

సం/- Md. అలీమొద్దీన్, MBA, LLB
అడ్వకేట్, నం. # 10-27/2/D,
విజయ్‌నగర్ కాలనీ, పరిగి మున్సిపాలిటీ,
వికారాబాద్ జిల్లా, తెలంగాణ
తేది:04.04.2024 సెల్ :9885889053

సైబర్ నేరాల నివారణే లక్ష్యం

జిల్లా ఎస్పీ కోటిరెడ్డి



వారియర్స్‌కు ఫోన్లు, సిమ్‌లు అందజేసిన కోటిరెడ్డి

అనంతగిరి: జిల్లాలో సైబర్ నేరాల నివారణే లక్ష్యంగా పని చేస్తున్నామని జిల్లా ఎస్పీ కోటిరెడ్డి అన్నారు. ఈ మేరకు గురువారం ఎస్పీ ఆయా పీఎస్‌ల వారీగా నియమించిన సైబర్ వారియర్స్‌తో సైబర్ నేరాలు, ప్రజలు మోసపోతున్న తీరు, నమోదయిన కేసుల్లో ఫ్రీజ్ అయిన నగదు, పోగొట్టుకున్న నగదు బాధితులకు తిరిగి అందజేసేందుకు తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా సైబర్ నేరాలపై ఫిర్యాదు చేసేందుకు బాధితులు తమ కేసులకు సంబంధించిన సమాచారం తెలుసుకునేందుకు అనువుగా సైబర్ వారియర్స్‌కు మొబైల్ ఫోన్లు, సిమ్‌కార్డులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాలానుగుణంగా పెరుగుతున్న సైబర్ నేరాలను అరికట్టేందుకు సైబర్ వారియర్స్ తమ పీఎస్ పరిధిలోని ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. సైబర్ నేరాలపై ఫిర్యాదులు అందిన వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. పిర్యాదులపై నిర్లక్ష్యం చేయొద్దన్నారు. జిల్లాలో జరుగుతున్న సైబర్ నేరాలకు సంబంధించిన రికార్డులను ఎప్పటికప్పుడు నమోదు చేసుకొని ప్రజల్లో అవగాహన కల్పించాలని ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్పీ రవీందర్‌రెడ్డి, జిల్లా సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ ప్రశాంత్‌రెడ్డి, ఐటీసీటీ ఇన్‌స్పెక్టర్ రఘురాం, ఎస్ఐ రాధిక, సైబర్ వారియర్స్, తదితరులు పాల్గొన్నారు.

BEFORE THE HON'BLE SUB REGITRAR OF CHITS (O/o DISTRICT REGISTRAR OF REGISTRATION OF CHITS)

AT:MAHABUBNAGAR
ARBITRATION CLAIM PETITION NO. 227 of 2022

Between:
PAVANASAI CHIT FUND PVT. LTD.
Mahabubnagar Branch, Represented by its Legal Officer Sri.M.Chennaiah ... Disputant
AND
[illegible] ...OPPONENTS No: 1 to 4

NOTICE

[illegible]

Where as the above Disputant have filed above Arbitration case. Against you and another by Disputant in Form No XVII, Chapter XI and Section 64 of the Chit Funds Act, 1982 & Rule 45 of the A.P. Chit Fund Rules 2008. The said case stands posted on 20-04-2024 for your appearance. You are hereby directed to appear before the above Registrar on said date at 11-00 a.m. either in person or through Advocate, in default the matter will be decided on the material available on record.

// BY ORDER OF THE SUB-REGISTRAR OF CHITS //
Date: 05-04-2024.
Counsel for Disputant
Sd/- C.RAJEEV KUMAR, Advocate
H.NO:5-1-41,Vallabhnagar,
MAHABUBNAGAR. Cell:9440512280

BEFORE THE HON'BLE SUB REGITRAR OF CHITS (O/o DISTRICT REGISTRAR OF REGISTRATION OF CHITS)

AT:MAHABUBNAGAR
ARBITRATION CLAIM PETITION NO. 228 of 2022

Between:
PAVANASAI CHIT FUND PVT. LTD.
Mahabubnagar Branch, Represented by its Legal Officer Sri.M.Chennaiah ... Disputant
AND
[illegible] ...OPPONENTS No: 1 to 5

NOTICE

[illegible]

Where as the above Disputant have filed above Arbitration case Against you and another by Disputant in Form No XVII, Chapter XII and Section 64 of the Chit Funds Act, 1982 & Rule 45 of the A.P. Chit Fund Rules 2008. The said case stands posted on 23-04-2024 for your appearance. You are hereby directed to appear before the above Registrar on said date at 11-00 a.m. either in person or through Advocate, in default the matter will be decided on the material available on record.

// BY ORDER OF THE SUB-REGISTRAR OF CHITS //
Date: 05-04-2024.
Counsel for Disputant
Sd/- C.RAJEEV KUMAR, Advocate
H.NO:5-1-41,Vallabhnagar,
MAHABUBNAGAR. Cell:9440512280

ధరణి లొసుగులతో పెరిగిన భూ విస్తీర్ణం



శంకరాపురంలోని వివాదాస్పదంగా మారిన భూమి

- కబ్జాకు యత్నిస్తున్నారని రైతుల ఆందోళన
- తమ దృష్టికి రాలేదన్న తహసీల్దార్

శంషాబాద్ రూరల్: ధరణిని అడ్డుపెట్టుకుని రికార్డుల్లో భూ విస్తీర్ణం పెంచిన అక్రమార్కులు పట్టా భూములను కబ్జా చేస్తున్నారని బాధిత రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై రెవెన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. మండలంలోని శంకరాపురం రెవెన్యూలోని సర్వే నంబరు 24లో 57 ఎకరాల 5 గుంటల భూమి ఉంది. ఇందులో 30 ఎకరాలు గైరాన్ కాగా.. 27 ఎకరాల 5 గుంటలను కొంతమంది పేద రైతులకు అసైన్ చేశారు. అయితే అసైన్ పట్టాదారుల నుంచి రియల్టర్లు 10 ఎకరాలు కొనుగోలు చేశారు. ఈ సర్వే నంబరులో మరో ఐదెకరాల విస్తీర్ణాన్ని రికార్డులో చేర్చారు. సదరు స్థలంలో అక్రమ నిర్మాణాలకు పూనుకున్నారని చెబుతున్నారు. గత కొద్ది రోజుల నుంచి ఈ భూమి చదును, ప్రహరీ నిర్మాణం చేపట్టారు. వారు కొనుగోలు చేసిన పదెకరాలకు తోడు కొత్తగా సృష్టించిన ఐదెకరాలను సొంతం చేసుకోవడానికి యత్నిస్తున్నారని ఆరోపణలున్నాయి. దీనికోసం సదరు భూమి పక్కన ఉన్న పట్టా భూముల్లోకి చొరబడి కబ్జాకు యత్నిస్తున్నారని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అందరికీ సమన్యాయం చేయాలి..

సర్వే నంబరు 24లో కొంత మంది భూములను పట్టా భూములుగా మార్చిన అధికారులు మిగతా రైతులకు కూడా పట్టాలు ఇచ్చి సమన్యాయం చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు సర్వే నంబర్లలో అదనపు భూ విస్తీర్ణాన్ని సృష్టించి పట్టా రైతుల పొలాలను కబ్జా చేసేందుకు యత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. గతంలో ఇచ్చిన ఫిర్యాదులకు అధికారులు స్పందించడం లేదని తాజాగా డీజీపీ, ఆర్డీఓకు ఫిర్యాదు చేసినట్లు రైతులు పేర్కొన్నారు. వివరణ కోసం తహసీల్దార్ నాగమణిని సంప్రదించగా.. ఇప్పటి వరకు తన దృష్టికి రాలేదని వివరణ ఇచ్చారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

కడ్తాల్: శ్రీశైలం–హైదరాబాద్ జాతీయ రహదారిపై గురువారం జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఎస్ఐ వరప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చల్లంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని వంపూగూడ గ్రామానికి చెందిన పోతుగంటి రామకృష్ణ ద్విచక్రవాహనంపై మైసిగండి వైపు వెళుతున్నాడు. మార్గమధ్యలో ఎస్ఎల్ఆర్ గార్డెన్ సమీపంలో కారు అతివేగంతో బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రామకృష్ణకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. క్షతగ్రాతున్ని చికిత్స నిమిత్తం 108లో ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యు లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


కాంగ్రెస్‌లో చేరిన వెంకటేష్‌చారి



సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన వెంకటేష్‌చారి

తాండూరు: ఎంపీటీసీల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు(గాజిపూర్ ఎంపీటీసీ) వెంకటేష్‌చారి గురువారం బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎంపీ రంజిత్‌రెడ్డి కీలక అనుచరుడిగా వెంకటేశ్ చారి ఉన్నారు. రంజిత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరాలని సూచించడంతో రంజిత్‌రెడ్డితో పాటు జిల్లా నేతలతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు.

బీఆర్ఎస్‌కు సంతోష్‌గౌడ్ రాజీనామా



తాండూరు: బీఆర్ఎస్ పార్టీ తాండూరు పట్టణ ప్రధాన కార్యదర్శి సంతోష్‌గౌడ్ గురువారం ఆ పార్టీకి రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా పత్రాన్ని మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డితో పాటు జిల్లా అధ్యక్షుడు ఆనంద్‌కు పంపారు. 2005 నుంచి యువజన కాంగ్రెస్ నాయకుడిగా రాజకీయాల్లోకి వచ్చిన సంతోష్‌గౌడ్ అంచలంచెలుగా పార్టీలో ఎదిగారు. గతంలో తాండూరు నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పని చేశారు. అయితే, 2018 అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీలో చేరిన రోహిత్‌రెడ్డి వెంట నడిచారు. అసెంబ్లీ ఎన్నికల్లో రోహిత్‌రెడ్డి గెలుపు కోసం పని చేశారు. అయితే రోహిత్‌రెడ్డి గెలిచిన 6 నెలలకే పార్టీ మారడంతో కాంగ్రెస్ కేడర్‌ను వెంట తీసుకెళ్లారు. ఇష్టం లేకున్నా వత్తిడి చేయడంతో వెంట నడిచారు. అయితే, ఇటీవల మారిన రాజకీయ పరిణామాల వల్ల బీఆర్ఎస్ పార్టీలో ఇమడలేక పార్టీ పదవికి సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు చెప్పారు. మరో రెండు రోజుల్లో కాంగ్రెస్ పార్టీలో చేరుతానని తెలిపారు.

పాంబండపై భక్తుల సందడి



పాంబండపై వంటలు చేస్తున్న భక్తజనం

కుల్కచర్ల: పాంబండ రామలింగేశ్వర దేవస్థానం భక్తులతో సందడి నెలకొంది. గురువారం మండలంలోని బండవెల్కిచర్ల గ్రామపరిధిలోని రామలింగేశ్వర దేవస్థానం బ్రహ్మోత్సవాల్లో భాగంగా సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు దేవస్థానం వద్ద వంటలు చేసి స్వామివారికి నైవేద్యాన్ని సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో భక్తులు స్వామివారిని దర్శించుకుంటున్నారు. ఆలయ చైర్‌పర్సన్ నర్సమ్మరాము లు భక్తులకు అవసరమైన ఏర్పాట్లను చేస్తున్నారు.

చేవెళ్ల గడ్డపై బీజేపీ జెండా ఎగురవేస్తాం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం

అనంతగిరి: చేవెళ్ల గడ్డపై బీజేపీ జెండా ఎగురవేస్తామని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు కేఎస్ రత్నం అన్నారు. వికారాబాద్ పట్టణంలోని నాగేష్‌గుప్తా గార్డెన్‌లో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎంపీ రంజిత్‌రెడ్డి చేవెళ్ల పార్లమెంట్‌కు చేసిందేమి లేదని ఆరోపించారు. ఆయన స్వప్రయోజనాలే చూసుకున్నారని మండిపడ్డారు. బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి నీతి నిజాయితీపరుడని కొనియాడారు. విజన్ ఉన్న కొండాకే ప్రజల మద్దతు ఉందన్నారు. దేశంలో మూడోసారి నరేంద్రమోదీ ప్రధాని మంత్రి అవుతారని ధీమా వ్యక్తం చేశారు. కొండా విశ్వేశ్వర్‌రెడ్డి చేపడుతున్న ప్రజా ఆశీర్వాద యాత్రకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు శివరాజు, పాండుగౌడ్, కేపీ రాజు, వివేకనందారెడ్డి, రామకృష్ణారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొలంలో పడి వృద్ధుడి మృతి

యాలాల: మూర్ఛవ్యాధి వల్ల పొలంలో పడిన ఓ వృద్ధుడు మృతి చెందిన ఘటన మండలంలోని నాగసముందర్ గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. యాలాల పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ హన్మంతు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మెట్టు రుస్తుం(62) గత కొంతకాలంగా మూర్ఛ వ్యాధితో బాధపడుతున్నాడు. కాగా, ఎప్పటిలాగే వరి పొలానికి బుధవారం సాయంత్రం వెళ్లాడు. పొలం వద్ద ఉండగా రుస్తుంకు మూర్ఛరావడంతో పొలంలో బోర్లా పడి మృతి చెందాడు. మరుసటి రోజు కుటుంబ సభ్యులు పొలంలో నిర్జీవంగా పడి ఉన్న రుస్తుంను గమనించి పోలీసులకు సమాచారమిచ్చారు. ఘటన స్థలంలో వివరాలు సేకరించిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాండూరులోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య అంజిలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు కానిస్టేబుల్ తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

CHANGE OF NAME

I, Mohammed Areef S/o Sadakali (Old Name), R/o H.No 6-64 Syedwada, Pargi Municipality, Vikarabad District. Telangana State, I am intending to change my name as Mahammed Arif S/o Mahammed Sadhakali (New Name), date of Birth: 15.02.1985 [H-804772]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని వివిధంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.